క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కోవెలకుంట్ల: మండలంలోని ఎంగోవిందిన్నె మెట్ట సమీపంలో నిర్మిస్తున్న పంచ మహా యజ్ఞాల ఆలయానికి మంగళవారం విరాళం అందించారు. ఉయ్యాలవాడ మండలం హరివరానికి చెందిన శివనాగిరెడ్డి తన వంతు సాయంగా రూ.10 వేలు ప్రకృతి పీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు మహేశ్వరరెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

బాలకృష్ణ జన్మదిన వేడుకలు



డోన్‌లో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

డోన్: ప్రముఖ నటుడు నందమూరి బాలక్రిష్ణ జన్మదినాన్ని మంగళవారం ఆయన అభిమానులు డోన్‌లో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అభిమానులు నాగేష్, టీస్టాల్ ఖాసీం, మధు, రాజు, సోమప్ప, ఖాజాహుసేన్, సూరి, అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



పి శివమణి | జి సుశాంత్ | సునంద



సాయిగణేష్

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. పి. శివమణి, సుశాంత్ జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలకు, సునంద గుత్తి గురుకుల పాఠశాల, ఎం. సాయిగణేష్ సి.బెల్‌గల్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గురుకుల పాఠశాలలో ఉచిత విద్య లభించనుంది.


రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లెరూరల్: మండలంలోని కై ప గ్రామంలో జరుగుతున్న రహదారి పనులను రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఘనంగా పౌర్ణమి పూజలు



సహస్ర దీపాలంకరణ సేవలో చౌడేశ్వరిదేవి

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి పల్లకీ సేవ చేశారు. అనంతరం ఉయ్యాలసేవ, సహస్రదీపాలంకరణ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హనుమంత వాహన గోవిందా



హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

సంజామల: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని నొస్సం గ్రామంలో బుగ్గ వేంకటేశ్వరస్వామి మంగళవారం హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

- కొత్త పింఛన్‌ల కోసం అర్హుల నిరీక్షణ
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- తెరుచుకోని వెబ్‌సైట్
- కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వం
- గతంలో ఆరు నెలలకు ఒకసారి దరఖాస్తుకు అవకాశం



ఈ ఫొటోలో నడవలేని స్థితిలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఓబన్న. కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీవాసి. నరాల బలహీనతతో ఇబ్బంది పడుతున్నాడు. సదరం క్యాంపునకు కుటుంబ సభ్యులు అతి కష్టం మీద తీసుకెళ్లారు. ఆర్థోపెడిక్ పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాడు. ఏడాది నుంచి కొత్త పింఛన్ దరఖాస్తు చేసేందుకు అవకాశం లేకపోవడంతో నిరుత్సాహంతో ఉన్నాడు. కుటుంబ సభ్యులు సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇది ఒక్క ఓబన్న సమస్య మాత్రమే కాదు బనగానపల్లె నియోజకవర్గంలో చాలా మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పరిస్థితి కూడా.

ఏడాదిగా ఎదురుచూపులే

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి జూన్4వ తేదీతో ఏడాది గడిచిపోయింది. కొత్తగా పింఛన్‌ల దరఖాస్తు కోసం అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు గ్రామాల్లో సచివాలయాల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు. పింఛన్ నమోదు చేసేందుకు వెబ్‌సైట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందో అధికారులకే తెలియని పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్న పింఛన్‌లు తప్ప కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కటంటే ఒక పింఛన్ ఇవ్వలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్‌ల దరఖాస్తుకు అవకాశం కల్పించారు. పారదర్శకంగా.. పార్టీలకతీతంగా పింఛన్‌లు మంజూరయ్యేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎప్పుడు మంజూరు చేస్తారా అని నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అన్ని కేటగిరీలకు చెందిన పింఛన్‌లు విడుదల చేయకుండా కేవలం స్పౌజ్ పింఛన్‌లు మాత్రమే విడుదల చేశారు. పింఛన్ తీసుకుంటున్న భర్త చనిపోతే భార్యకు పింఛన్ బదిలీ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక వారి గురించి ఆలోచించడమే మానేశారు. కూటమి నాయకుల మాయ మాటలకు బోల్తా పడి ఓట్లు వేసి గెలిపిస్తే తగిన గుణపాఠం చెప్పారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొలిమిగుండ్ల సచివాలయం

రీవెరిఫికేషన్‌తో ఆందోళన

దివ్యాంగులు, చెవుడు, మూగ తదితర పింఛన్‌లపై కొద్ది రోజుల నుంచి రీవెరిఫికేషన్ చేస్తున్నారు. బనగానపల్లె, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రులకు దశలవారీగా పిలిచి వెరిఫికేషన్ చేస్తుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పింఛన్‌లు తొలగించేందుకు రీవెరిఫికేషన్‌తో పేరుతో కుట్ర పన్నిందని మండిపడుతున్నారు. ఆసుపత్రుల వద్దకు వెళ్లాక వైద్యులు ఆధార్, సర్టిఫికెట్లు పరిశీలించి పంపించేస్తున్నారు. దీంతో ఎవరి పింఛన్ ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చాలా మంది దివ్యాంగులు, ఇతరులు పింఛన్ సొమ్ము మీదనే ఆధారపడ్డారు. పింఛన్‌లు తొలగించేందుకే వెరిఫికేషన్ చేస్తున్నారని ప్రచారంలో ఉండడంతో ఏమి పాలుపోలేని స్థితిలో పడ్డారు.

పరిశీలించి పంపించారు



ఇటీవల బనగానపల్లెకు పింఛన్ రీవెరిఫికేషన్‌కు వెళ్లాను. వైద్యులు అప్లికేషన్ తీసుకుని పంపించారు. ఎలాంటి పరీక్షలు చేయలేదు. ఓవైపు కంటి సమస్య ఉండడంతో 2009 నుంచి పింఛన్ తీసుకుంటున్నాను. వెరిఫికేషన్ బట్టి చూస్తే పింఛన్‌లు తొలగించేందుకు కుట్ర పడుతున్నారని అనుమానం వస్తోంది.

–వెంకటేశ్వరరెడ్డి, పెద్దవెంతుర్ల

వెబ్‌సెట్ ఓపెన్ కాలేదు

కొత్తగా పింఛన్‌లు దరఖాస్తు చేసేందుకు ఇప్పటి వరకు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. వెబ్‌సైట్ తెరుచుకుంటేనే దరఖాస్తుకు అవకాశం ఉంటుంది. స్పౌజ్ పింఛన్‌లకు అవకాశం కల్పించడంతో దరఖాస్తు చేసుకున్నారు. వారికి మాత్రమే మంజూరు అయ్యాయి. వీరికి త్వరలోనే పింఛన్ సొమ్ము అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

–ప్రసాదరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, కొలిమిగుండ్ల

జనని బ్యాంకు కేసులో మరొకరి అరెస్ట్

కోవెలకుంట్ల: ఎక్కువ వడ్డీ ఆశ చూపి ఖాతాదారులను మోసం చేసిన జననీ బ్యాంకు కేసులో మంగళవారం మరొకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం సోమవాండ్లపల్లెకు చెందిన ఆకుల వెంకటరమణ, కోవెలకుంట్లకు చెందిన గువ్వల పద్మావతి మరికొంత మందితో కలిసి నాలుగేళ్ల క్రితం పట్టణంలోని ఓంశాంతి భవన సమీపంలో జనని మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీని ఏర్పాటు చేశారు. సొసైటీలో డబ్బులు డిపాజిట్ చేస్తే మిగతా ప్రైవేట్ బ్యాంకులకంటే ఎక్కువ శాతం వడ్డీ ఇస్తామని, డిపాజిట్లపై రుణాలు తీసుకోవచ్చని నమ్మబలికించారు. వీరి మాటలు నమ్మి కోవెలకుంట్లతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఖాతాదారులుగా చేరి లక్షలాది రూపాయాలు డిపాజిట్లు చేశారు. ఈ సొమ్మును సంస్థ సీఈఓ వెంకటరమణ తన వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసుకుని స్వాహా చేశాడు. ఫిక్సుడ్ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాదారుల బాండ్లకు గడవు తీరిపోవడంతో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు సొసైటీ వద్దకు వెళ్లగా సంస్థయాజమన్యం బోర్డు తిప్పేయడంతో బాధితులు ఈ నెల 4వ తేదీ కోవెలకుంట్ల పోలీసులను ఆశ్రయించారు. ఐదుగురు ఖాతాదారులకు చెందిన రూ. 13.45 లక్షలు స్వాహా చేసినట్లు కేసు నమోదు చేశారు. నిందితులైన గువ్వల పద్మావతి, ఆకుల భరద్వాజ్‌ను ఇటీవల అరెస్ట్ చేయగా కేసులో నిందితురాలిగా ఉన్న బ్యాంకు అధ్యక్షురాలు సుజాతను అరెస్ట్ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ వివరించారు.

బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత



దొరపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



బేతంచెర్ల:ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

డోన్: బాల్య వివాహాలను అడ్డుకోవడం, నిర్మూలించడం సామాజిక బాధ్యత అని సీడీపీఓ షంషాద్‌బేగం అన్నారు. మండలంలోని దొరపల్లె గ్రామంలో కిశోర బాలికల వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల మానసిక, శారీరక సమస్యలు వస్తాయని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని.. చేసినా, సహకరించినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించగలుగుతారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శోభారాణి, బంకు శ్రీను, మెట్టు నాగరాజు, మిట్టా నాగేంద్ర, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- **కోవెలకుంట్ల:** బాల్య వివాహాలతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని కోవెలకుంట్ల ఎంపీడీఓ వరప్రసాదరావు అన్నారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో కిశోరి వికాసం-వేసవి సెలవులు కార్యక్రమంపై కిశోర బాలికలు, తల్లులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాల్యవివాహాలు, పోక్సో చట్టం, లింగ వివక్ష, క్రీడల ప్రాముఖ్యత తదితర అంశాలను తెలియజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతా ల్లో తల్లితండ్రులకు సరైన అవగాహన లేకపోవడం వల్లే చిన్న వయసులోనే వివాహాలు చేస్తున్నారన్నారు. వివాహం అనంతరం ఆరోగ్య సమస్యలు తలెత్తి తల్లీ బిడ్డ ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందన్నారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చెన్నమ్మ, సుగుణ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

బేతంచెర్ల: బాలికల విద్యను తల్లిదండ్రులు ప్రోత్సాహించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాధమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని 1వ గ్రామ సచివాలయంలో కిశోర బాలికలు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. బాలురతో సమానంగా బాలికలను చదివిస్తామని, 19 ఏళ్ల తరువాతనే వివాహం చేస్తామని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, పౌష్టికాహారం, పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు.

గర్భిణుల వివరాలు పక్కాగా ఉండాలి

ప్యాపిలి: పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు, నవజాత శిశువుల వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని జిల్లా ప్రోగ్రాం మేనేజ్మెంట్ యూనిట్ డాక్టర్ అంకిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీ పరిధిలోని 12 సచివాలయాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలతో ఆయన మాట్లాడారు. గర్భిణులు, నవజాత శిశువలకు ఐడీ కేటాయించి సంబంధిత వివరాలను నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ల్యాబ్ భవనాన్ని పరిశీలించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాహుల్, సిబ్బంది విజయకుమారి, రాఘవేంద్ర గౌడ్, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అధికారి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

డోన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని.. అప్పుడే మానవ మనుగడ సాధ్యమని ముస్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌తో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. మున్సిపల్ పరిధిలో 5 వేల మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డోన్‌ను గ్రీన్‌సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అందుకు పట్టణ ప్రజలు సహకరించాలని చైర్మన్ రాజేష్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, మున్సిపల్ ఏఈ, డీఈ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో కాటసాని

బనగానపల్లె: మండలంలోని యనకండ్ల గ్రామంలో మైహోం ఇండస్ట్రీస్ వారి మహా సిమెంట్ లిమిటెడ్ ప్రాంగణంలో మంగళవారం సీతారామ చంద్ర స్వామి 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు. ఆయన్ను మైహోం సంస్థ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు సన్మానించారు. అలాగే టంగుటూరు గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని కాటసాని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



జోరుగా ఉల్లినాట్లు

బేతంచెర్ల: మండలంలోని పలు గ్రామాల్లో జోరుగా ఉల్లి నాట్లు వేస్తున్నారు. ఆర్ఎస్ రంగాపురం, యంబాయి, సీతారామాపురం, బైనపల్లె, శంకలాపురం, ముద్దవరం, రుద్రవరం గ్రామాల్లో బోరుబావుల కింద ఉల్లి వేస్తున్నారు. పంటకు మార్కెట్‌లో ధర లేకున్నా పెరుగుతుందనే ఆశతో సాగులో నిమగ్నమయ్యారు.

నేడు యోగాంధ్రపై సమీక్ష

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. 13న ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బెలుం గుహల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందన్నారు. సమీక్ష సమావేశానికి డోన్ ఆర్డీఓ, డీఎల్‌పీఓ హాజరవుతారని చెప్పారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

విద్యార్థినికి అభినందన

కోవెలకుంట్ల: పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి రెండు రోజుల క్రితం కలెక్టర్ నుంచి ప్రతిభా పురస్కారం అందుకున్న స్థానిక సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థినికి మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. గత విద్యా సంవత్సరం పది ఫలితాల్లో 591 మార్కులు సాధించిన హరిత 2025 షైనింగ్ స్టార్‌గా ఎంపికై ంది. రెండు రోజుల క్రితం కలెక్టర్ రాజకుమారి, డీఈఓ జనార్దనరెడ్డి రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ మేరకు హెచ్ఎం గీత, ఉపాధ్యాయులు హరితను ప్రత్యేకంగా అభినందించారు.

బీరు సీసాతో యువకుడిపై దాడి

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఇరువురి యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కాలనీలో నివాసం ఉంటున్న వినయ్ అనే యువకుడికి సంజామలకు చెందిన కృష్ణకాంత్ అనే మరో యువకుడికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో వినయ్‌ని కృష్ణకాంత్ బీరుసీసాతో పొడిచి పరారయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

అవుకు: మండల పరిధిలోని లింగంబోడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వరదా వెంకట సుబ్బయ్య కుమారుడు వరదా శ్రీనివాసులు(27) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి లింగంబోడు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు.

ఘర్షణలో వ్యక్తికి గాయాలు



క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న అమ్మ హోటల్ సమీపంలో మంగళవారం ఉదయం ఇద్దరి వ్యక్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన బోయ సునీల్, ఉప్పరి శ్రీనివాసుల మధ్య మాటామాట పెరిగి దాడి చేసుకోవడంతో ఉప్పరి శ్రీనివాసులు కుడికాలికి గాయాలయ్యాయి. పాత కక్షలు మనసులో ఉంచుకుని దాడులకు పాల్పడినట్లు తెలిసింది. గాయపడిన శ్రీనివాసులను చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. బాధితుని భార్య ఉప్పరి శ్రీదేవి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సాగులో సస్యరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ధనలక్ష్మి

బేతంచెర్ల: రైతులు శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ధనలక్ష్మి, కృష్ణమూర్తి, ఆదినారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోరుమానుకొండ, ముద్దవరం, సీతారామాపురం రైతులతో సమావేశం నిర్వహించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ పంటల సాగు, భూసార పరీక్షలు, ఎరువుల యాజమాన్యం, ప్రస్తుతం సాగులో ఉన్న పంటల్లో వేయాల్సిన ఎరువుల మోతాదును రైతులకు వివరించారు. కంది, వేరుశనగ, కొర్ర, సజ్జ, మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలైన విత్తనశుద్ధి, తెగుళ్లు, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

ఆస్పత్రి ప్రాంగణంలో వ్యక్తి ఆత్మహత్య



వెంకటరమణ మృతదేహం

బనగానపల్లె రూరల్: కోవెలకుంట్ల మండలం సొదరదిన్నె గ్రామానికి చెందిన జి.వెంకటరమణ(38) కడపు నొప్పి తాళలేక మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటరమణ కొన్నేళ్ల నుంచి కడపు నొప్పితో బాధపడుతున్నాడు. ఉదయం కడపు నొప్పితో పాటు భార్య అనురాధకు థైరాయిడ్‌కి చూపించుకునేందుకు బంధువులతో కలిసి బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాడు. అయితే భార్య వైద్యులని దగ్గరకు వెళ్లింది. కడపు నొప్పి బాధ తాళలేక వెంకటరమణ ఆస్పత్రి ప్రాంగణంలోనే పురుగుల మందు తాగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు సీఐ వెల్లడించారు. మృతుడికి ఇద్దరు సంతానం. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'సూర్యఘర్'తో ఎంతో ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న డోన్ విద్యుత్ డీఈ

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ డీఈ కమలాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాల్లో విద్యుత్ ఏడీ మధుసూదన్‌రెడ్డి, రూరల్, టౌన్ ఏఈలు పుల్లయ్య, శ్రీనివాసులు ఆధ్వర్యంలో సూర్యఘర్ పథకంపై విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ పథకం ద్వారా ప్రజలు తమ ఇళ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చని తెలిపారు. వీటిపై వినియోగదారులకు అవగాహన కల్పించి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

డోన్ టౌన్: నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టి రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం నంద్యాలలో కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. కొందరు నకిలీ వత్తనాలను బ్రాండెడ్ కంపెనీల పేరుతో ప్యాకేజింగ్ చేసి రైతులకు అంటగడుతున్నారని ఫిర్యాదు చేశారు. నంద్యాల పట్టణ కేంద్రంగా నకిలీ దందా సాగుతోందని.. వీటికి అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు.

రహదారి వెంట నేమ్ బోర్డుల ఏర్పాటు



బలపాలపల్లె రహదారిలో ఏర్పాటు చేసిన బోర్డు

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి బేతంచెర్ల మండలం మీదుగా డోన్ వరకు సుమారు రూ.650 కోట్లతో చేపట్టిన (340బీ)జాతీయరహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండల పరిధిలోని గోరుమానుకొండ మోడల్ స్కూల్ వద్ద ఉన్న మలుపు వద్ద మినహా రహదారి పనులు చివరి దశకు చేరుకున్నాయి. బేతంచెర్ల పట్టణం సమీపాన, హెచ్ కొట్టాల, ఆర్ఎస్ రంగాపురం, ఆర్ కొత్తపల్లె వరకు రహదారి వెంట నేము బోర్డులు, ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలకు వెళ్లే వాహనదారులను దృష్టిలో ఉంచుకుని నేమ్ బోర్డులు, రహదారిపై పెయింటింగ్ వేయడంతో నూతన రహదారిపై వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

యువకుడి అదృశ్యం



భరద్వాజ్ (ఫైల్)

డోన్ టౌన్: రైలులో హైదరాబాద్ నుంచి డోన్‌కు వస్తున్న భరద్వాజ్ (20) అదృశ్యమైనట్లు రైల్వే ఎస్ఐ బిందుమాధవి మంగళవారం తెలిపారు. పట్టణంలోని పాతపేటకు చెందిన సునీల్ ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా స్థిరపడ్డాడు. ఆయన కుమారుడు భరద్వాజ్‌కు మెదడులో రక్తం గడ్డకట్టడంతో కొద్ది నెలల క్రితం కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ శస్త్రచికిత్స చేయించారు. వైద్య పేరీక్షల నిమిత్తం సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి డోన్‌కు కాచిగూడ-గుంటూరు(17252) రైలులో వస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు రైలు డోన్‌కు చేరుకోగా ఎంతకూ రాకపోవడంతో పికప్ చేసుకోవడానికి వెళ్లిన బంధువులు అతని సీటు వద్దకు వెళ్లి చూడగా లగేజీ బ్యాగు, సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. సమాచారం తెలిస్తే రైల్వే ఎస్ఐ 9030481295 లేదా తండ్రి 7075659850 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

బనగానపల్లె: పట్టణంలోని పెట్రోల్‌బంక్ సెంటర్ నుంచి ఆంజనేయస్వామి ఆలయం మీదుగా పాట్టిశ్రీరాములు సెంటర్ వరకు ఏర్పాటు చేసిన ప్రధాన రహదారిపై పాత కూరగాయాల మార్కెట్ వద్ద ఏర్పడిన గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. గుంత ఏర్పడడంతో ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉంది.



ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత